
# కదలిపోయిన వెన్నెల




**ఆ** రాత్రి వెన్నెల నీలవేణి నవ్వులా వుంది.

సెవెన్ హిల్స్ హోటల్లో భోజనం చేసి నా గదికి వచ్చేసరికి ఎనిమిది గంటలు దాటుతోంది. పాంటు, షర్టు విప్పి హేంగరుకు తగిలించి లాల్చీ, పైజామా వేసుకున్నాను. కిటికీ తలుపులను మూసి లైటార్పి, గదికి తాళంపెట్టి పక్కబట్టలు, సిగరెట్ పాక్, అగ్గిపెట్టె తీసికొని డాబా మీదకు వెళ్ళాను. డాబా మీది వెన్నెల పిండారబోసినట్లుగా వుంది. వేసవికాలం కావటం చేత పక్కింటి డాక్టరుగారి ఇద్దరు కూతుళ్ళు, వారి చిన్నతమ్ముడు అప్పటికే వారి డాబామీదకు వచ్చి పక్కలు పరుచుకుని సినిమా కబుర్లు చెప్పుకుంటున్నారు.

నేనూ పక్కపరచుకొని వెల్లికింతలా పడుకున్నాను. పాక్‌లోనుంచి సిగరెట్ తీసి వెలిగించాను. గట్టిగా దమ్ముపీల్చి పొగ బయటకు వదులుతూ ఆకాశంచేసి చూశాను. నలుపు- నీలిరంగుల కలయికలో వుంది. ఒత్తుగా వున్నాయి చుక్కలు. అల్యూమినియం రేకు బిళ్ళలా వున్నాడు చంద్రుడు.

ఆ డాబామీద పడుకునేది నేనొక్కడినే. మా ఇంటావిడవున్నా ఆమె క్రిందే పడుకుంటుంది. పదేళ్ళకే భర్త పోయాడుట. ఆ తర్వాత చేతికి అంది వచ్చిన కొడుకూ ఏదో ప్రమాదంలో పోయేడుట. ఆమెకు నేనంటే ఎంతో ప్రేమ. నేనూ ఆమె కొడుకులా వుంటానట.

డాబా క్రిందగా వున్న పారిజాతం చెట్టు పూలవాసన గాలి వీచినప్పుడల్లా పైకి వచ్చి మనసుకు హాయిని కలిగిస్తోంది. డాబా మీదకు ఒరిగి ముద్దు పెట్టుకుంటున్నట్లున్న కొబ్బరిచెట్టు, కొబ్బరి ఆకులమీద పడుతున్న వెన్నెల క్రిందికి జారిపోతోంది. ఆ దృశ్యాన్నే చూస్తూ సిగరెట్టు కాలుస్తున్న నాకు ఆ క్షణంలో నీలవేణి మదిలో మెదిలింది.

నీలవేణికి ఇలాంటి వెన్నెల రాత్రులంటే ఎంతో ఇష్టం. నీలవేణికి ఇష్టం కాబట్టి నాక్కూడా ఇలా డాబామీద వెన్నెల్లో పడుకొని చంద్రుడికేసి, చుక్కల కేసి చూడటం మరీ ఇష్టమే. అదేమిటో కాని నేను, నీలవేణి ఎప్పుడు కలుసుకున్నా మా డాబామీదే కలుసుకునే వాళ్ళం. వెన్నెలలో ఒకరి పక్కన ఒకరం కూర్చుని ఏవో తీయని మాటలు మాట్లాడుకునేవాళ్ళం. ఎన్ని మాటలు మాట్లాడుకున్నా ఇంకా ఎన్నో విషయాలు మాట్లాడుకోవాలని, ఎన్ని వూసులో చెప్పుకోవాలని అనిపించేది. ఎంతసేపు మాట్లాడుకున్నా ఇద్దరికీ తనివి తీరేది కాదు. తృప్తి వుండేది కాదు.

నీలవేణి, నేను అంతగా కలసి పోయాము. ఒకరినొకరం అంత గాఢంగా ప్రేమించుకున్నాము. ఎవ్వరూ మమ్మల్ని విడదీయలేనంతగా పాలు, నీరులా కలసి పోయాము. నీలవేణి ఎవరో కాదు, చిన్నతనం నించీ నాతో కలసి తిరిగిన నా స్నేహితురాలు. వయసు వచ్చేవరకూ పెరిగిన మా స్నేహబంధం ఆ తర్వాత ప్రేమబంధంగా మారింది. నీలవేణి, నేను కలసి తిరగటం మా ఇద్దరి పెద్దలకూ అంగీకారమే. పైగా నీలవేణి తండ్రి, మా నాన్న మంచి స్నేహితులు. మా ఇద్దరి పెద్దలలోనూ అటువంటి అభిప్రాయం పెనవేసుకుపోవడంతో ఎవ్వరూ మా ప్రణయానికి అడ్డుపడలేదు. ఆ విధంగా సాగిపోయింది నీలవేణితో నా ప్రణయ జీవితం.

వెన్నెల రాత్రులలో రోజూ ఇంటికి వచ్చేది నీలవేణి. చదువుకోవడం కోసం పుస్తకాలు కూడా తీసుకొచ్చేది. కాని చదివేది కాదు. నా భోజనం పూర్తి కాగానే ఇద్దరం డాబామీదకు వెళ్ళి కూర్చునేవాళ్ళం. వెన్నెలలో కూర్చుని ఏవో కబుర్లు చెప్పి నవ్వుతుండేది నీలవేణి. ఆమె నవ్వును చూస్తూ నన్ను నేనే మరిచిపోయేవాడిని. ఆ నవ్వుకోసమే ఆమెను పదే పదే

నవ్వించేవాడిని. నీలవేణి ఎంతో అందంగా, నిర్మలంగా నవ్వుతుంది. వెన్నెలలో ఆమె పలువరుస ముత్యాల్లా మెరిసేది. ఆమె ముఖం మరింత అందంగా వుండేది.

నీలవేణి నవ్వును జీవితాంతం చూద్దామనుకున్నాను. ఆమెతోనేనా బ్రతుకు ముడిపడిందనుకున్నాను. ఇప్పుడు అవి నిజంగా కలలు, వూహలు. వాటిలో ఒక్కటీ నిజమవలేదు. నా కలలన్నీ కల్లలైనాయి. నా వూహలన్నీ కరిగిపోయాయి. చివరికి నేను నేనుగానే మిగిలిపోయాను. నీలవేణి భర్తను కాలేకపోయాను.

నా భార్య కావాలని నీలవేణి ఎంతో తాపత్రయ పడింది. నేను నీలవేణి భర్త కావాలని పడిన ఆదుర్దాకంటే ఆమె నాకు భార్య కావాలని పడినతపనే ఎక్కువ. ఆమె ఎప్పటికైనా నా భార్య కాకపోదనే భరోసా నాకుండేది. కాని తను నన్ను భర్తగా పొందలేనేమోననే భయం నీలవేణిని అనుక్షణం వెంటాడుతుండేది.

ఆమె అలా భయపడటానికి కారణం లేకపోలేదు. నీలవేణికి ఒక మొగుడు పోయిన మేనత్త వుండేది. ఆమె జబ్బు మనిషి. ఎప్పుడూ మంచంలోనే వుండేది. ఆమెకు ఒక్కడే ఒక్క కొడుకు. సుందరరావు. సుందరరావు తల్లి తను అనుక్షణం చావుకు దగ్గరపడుతుందని తెలియగానే ఆమెలో తన కొడుకు పెళ్ళి చూసి చనిపోవాలనే కోరిక బలంగా కలిగింది. ఆమెకు మేనరికాలంటే ఎంతో ఇష్టం. అందుకే తన తమ్ముడి కూతురైన నీలవేణంటే ఆమెకు చెప్పలేని ప్రేమ. ప్రతి వేసవికాలం సెలవుల్లో నీలవేణిని తన దగ్గరకు పిలిపించుకుని, కొన్నాళ్ళు తన దగ్గర వుంచుకొని సుందరరావుని చేసుకోమని చిలక్కి చెప్పినట్టు చెప్పేది. నీలవేణి మాట్లాడేది కాదు. అప్పుడే తన నిర్ణయాన్ని ఆమెకు చెప్పి పెద్దదయిన ఆమె మనసును నొప్పించడం ఇష్టంలేక మౌనంగా వుండేది. తన మనసులో వున్న కోరికను తన తమ్ముడైన నీలవేణి తండ్రితో చెప్పింది ఆమె. నీలవేణిని తన కోడల్ని చెయ్యమన్నది. ఆయన తన కూతుర్ని సుందరరావుకు ఇవ్వటానికి సుతరామూ ఇష్టపడలేదు. సుందరరావు ఏమంత మంచివాడు కాదన్న సంగతి ఆయనకు తెలుసు. అందుకే నీలవేణి నా భార్యవుతుందనుకున్నాను.

మనం అనుకున్నవి అనుకున్నట్లు జరిగితే అంతకంటే కావలసింది ఏముంది? నేనుకున్నట్లు నీలవేణి నా భార్య కాలేదు. తన అంతిమ క్షణాల్లో తమ్ముడిని పిలిపించి కంట తడిపెట్టి తన కోరిక తీర్చమన్నది సుందరరావు తల్లి. ఆయన ఒప్పుకోలేదు. ఆమెవల్ల అంతో ఇంతో ఉపకారం పొందిన బంధువులు ఆమె కోరిక తీర్చమని ఆయనను పోరారు. పెళ్ళయితే సుందరరావు మారతాడన్నారు. నీలవేణీ సుందరరావుని మంచి దారిలో పెడుతుందని అన్నారు. ఇంకా ఎన్నో మాటలు చెప్పి ఆయనను బలవంత పెట్టారు. చివరికి ఆయన పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా అయింది. బంధువుల ఆగ్రహానికి గురి కావటం

ఇష్టంలేక, తన సొంత అక్కయ్య కన్నీళ్ళు చూడలేక అయిష్టంగా తన అక్కయ్య కోరిక తీర్చాడు. తండ్రి మాటకు ఎదురు చెప్పలేని నీలవేణి పరిస్థితిని గ్రహించి కుమిలి కుమిలి ఏడుస్తూనే సుందరరావు భార్య అయింది. పెళ్ళయిన మరురోజు సుందరరావు తల్లి, నీలవేణిని తన కోడలు చేసుకున్నానే తృప్తికొద్దీ, నన్నూ- నీలవేణినీ విడదీసిన పాపాన్ని మూట కట్టుకొని నరకానికి పోయింది.

చివరకు నాకూ నరకమే మిగిలింది. అసలు ఈ సమస్య రాకముందే నీలవేణిని పెళ్ళి చేసుకుని వుంటే బావుండే దనిపించింది. అప్పటికీ తనని చేసుకోమని నీలవేణి నన్ను ఎన్నోసార్లు ఒత్తిడి చేసింది. తన మేనత్త ఏదో ఒకరోజు ఇలాంటి పరిస్థితి కల్పిస్తుందని నీలవేణి మొదట్నించీ అనుమానిస్తూనే వుంది. కాని నేనే ఆమె మాటలను లెక్కచెయ్యలేదు. డిగ్రీ చేతికి రాగానే, ఎక్కడైనా ఉద్యోగం దొరకగానే చేసుకుంటా నన్నాను. డిగ్రీ చేతికొచ్చింది. పురుష లక్షణంగా ఉద్యోగం కూడా వచ్చింది. కాని ఏం లాభం? అప్పటికే నీలవేణి కాపురానికి వెళ్ళిపోయింది.

నీలవేణి కాపురానికి వెళ్ళబోయేముందు మేమిద్దరం మా డాబామీదే కలుసుకున్నాము. మేం కలుసుకున్న రోజు వెన్నెల లేదు. చీకటి, ఒకరి ముఖాలొకరికి సరిగా కనిపించడం లేదు.

నిజానికి ఆమె తప్పు ఎంతమాత్రం లేకపోయినా, నా భార్య కాకుండా పోయినందుకు నీలవేణిమీద నాకు కసిగా వుంది. బహుశా నీలవేణికి కూడా నేను భర్తను కాలేక పోయినందుకు కసిగా వుండవచ్చు. మా ఇద్దరినీ విడదీసినందుకు సుందరరావుకు ఎవరిమీదా కసిగా లేదు? అవును ఎందుకుంటుంది? బంగారు బొమ్మలాంటి నీలవేణి తన భార్య అయింది కదూ?

మాట్లాడకుండా నా దగ్గరగా కూర్చుంది నీలవేణి. ఒకవేళ మితిమీరిన దుఃఖం మాటలను పెగలనీయటం లేదేమో! గుండెలు పగిలే ఆవేదన నీలవేణి నోటిని నొక్కి వేసి వుండవచ్చును.

ఆ నిశ్శబ్దాన్ని భరించలేకపోయాను. చివరికి నేనే "నీలవేణి" అంటూ ఏదో మాట్లాడబోయాను. తను మాట్లాడకపోయినా నన్నుకూడా మాట్లాడనివ్వలేదు నీలవేణి.

"నువ్వేం చెప్పొద్దు సారథీ. ఇక ఎన్ని మాటలు మాట్లాడుకున్నా మరింత దుఃఖం పెరిగటం తప్పితే అందువల్ల ఉపయోగం లేదు. నువ్వెంత బాధపడుతున్నావో నాకు తెలుసు. ఎవరి బాధ వారి గుండెలను పిండివేస్తుంటే ఒకరినొకరు ఓదార్చుకోడంలో అర్థం లేదు. జరిగిందేదో జరిగింది. నేను వెళ్ళిపోతున్నాను. నీకు దూరమైనా నన్ను మరిచిపోవడానికి ప్రయత్నించు సారథీ. నా తలపులు నీకు బాధ కలిగిస్తున్నా నన్ను మరిచిపోవడానికి ప్రయత్నిస్తే అది మన ప్రేమకే కళంకం. నన్ను మరిచిపోవు కదూ" అంటూ వడివడిగా వెళ్ళిపోయింది.

నీలవేణి నా గుండెల మీదుగా నడిచి వెళ్ళినట్టనిపించింది. ఆవేశంగా పెదవి కొరుక్కున్నాను. అంతకుమించి ఆ క్షణంలో ఏమీ చెయ్యలేకపోయాను.

ఆ తర్వాత నీలవేణి ఎడబాటు నాకు తీరని వ్యథను కలిగించింది. ఆమె తలపులు నన్ను కొన్నాళ్ళవరకు వెంటాడాయి. ఇన్నాళ్ళూ నా ఇంటి దీపమనుకున్న నీలవేణి మరో ఇంటి ఇల్లాలయిందని గుర్తుకొచ్చినప్పుడల్లా నా గుండెల్లో ఏదో గుచ్చుకున్నట్టనిపించేది. క్రమంగా నీలవేణీ నేనూ విడిపోయామనే బాధను మరచిపోతూ, మేమిద్దరం కలుసుకున్నప్పటి తీయని అనుభూతులను గుర్తు తెచ్చుకోవడం మొదలుపెట్టాను.

కాపురానికి వెళ్ళిన ఆరునెల్ల తర్వాత నీలవేణి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. తన భర్త తాగుబోతు అనీ, అతనికి చాలా మంది స్త్రీలతో సంబంధం వుందనీ, తాగి వచ్చి రోజూ తనని చావ కొడుతున్నాడనీ, అతనితో కాపురం చెయ్యటం దుర్భరంగా వుంది సారథీ అని వ్రాసింది. ఆ ఉత్తరం చదివి ఎంతో బాధపడ్డాను. కుందనపు బొమ్మలాంటి నీలవేణిని అన్ని కష్టాలు పెడుతున్నాడని తెలియగానే సుందరరావు మీద అంతులేని ఆగ్రహం కలిగింది. కాని ఏం చెయ్యగలను? బాధపడటం తప్పించి మరేమీ చెయ్యలేకపోయాను. నీలవేణి ఉత్తరానికి జవాబు వ్రాయలేదు. ఆ తర్వాత నీలవేణినించి ఉత్తరం అందుకోలేదు.

ఇప్పటికి నీలవేణీ, నేనూ విడిపోయి నాలుగేండ్లయింది.

నీలవేణి ఆలోచనలతో మునిగి తేలుతున్న నేను "సారథీ... సారథీ" అని క్రిందనించి ఎవరో పిలవటంతో ఆలోచనల నించి బయటపడ్డాను.

పదిగంటలవుతుందను కుంటాను. పక్క డాబామీదకు చూశాను. డాక్టరుగారి పిల్లలు నిద్రపోతున్నారు.

ఇంత రాత్రివేళ నాకోసం ఎవరు వచ్చారో అర్థంకాలేదు. ఆశ్చర్యంతో క్రిందికి వెళ్ళాను. గేటుతీసి బయటకు వెళ్ళేసరికి రోడ్డుమీద వేణుగోపాల్ నిల్చుని వున్నాడు.

"నువ్వా?" అన్నాను ఆశ్చర్యంగా.

వేణుగోపాల్ మాట్లాడలేదు. అతని చేతిలో సిగరెట్ ఎర్రగా వెలుగుతోంది.

"ఇంత రాత్రివేళ వచ్చావేం? ఏమైనా పనుండి వచ్చావా?" అడిగాను.

"నీతో ఒక మాట చెబుదామని వచ్చాను" అన్నాడతను దమ్ము పీల్చి.

"ఏమిటి?" కుతూహలంగా అడిగాను.

"నీలవేణి ఈ ఊళ్ళోనే వుంది" కొంచెం చిన్నగా అన్నాడు వేణుగోపాల్.

"నీలవేణి ఈ ఊళ్ళో ఉందా?" నాలో నేనే అనుకుంటున్నట్లు అన్నాను. చాలా ఆశ్చర్యం కలిగింది. నీలవేణి ఈ ఊళ్ళో ఎందుకు వుంటుంది? ఒకవేళ సుందరరావుకు ట్రాన్స్ఫరయిందేమో. లేక ఎవరైనా బంధువులింటికి వచ్చిందేమో. అప్పటివరకు నీలవేణి

గురించి ఆలోచించిన నాకు వేణుగోపాల్ ఆమె ఆ వూళ్ళోనే వుందని చెప్పగానే ఒక్కసారి ఆమెను చూడాలనే ఆత్రుత నాలో కలిగింది.

"ఎక్కడుందో నీకు తెలుసా?" అడిగాను.

"ఆc, వస్తే చూపించగలను"

"వెడదాం పద" అంటూ ముందుకు కదిలాను. లాల్చీ, పైజమాతోనే వేణుగోపాల్ వెనుక బయల్దేరాను. ఎన్నాళ్ళనించో నాలో అణగివున్న నీలవేణిని చూడాలనే కోరిక ఆమె ఆ వూళ్ళో వుందని తెలియగానే మరింత చెలరేగింది. ఆ నిమిషంలో నీలవేణిని కలుసుకోవడం మంచిదో, కాదో కూడా నేను ఆలోచించుకోలేక పోయాను.

తను మరో సిగరెట్ వెలిగించాడు. సిగరెట్, లైటర్‌ను నాకు అందించాడు వేణుగోపాల్. సిగరెట్ వెలిగించి ఆ రెంటినీ అతనికి ఇచ్చాను. వేణుగోపాల్ నాకు మంచి స్నేహితుడు. అంతే కాదు అతను బంధువు కూడా అవుతాడు. నీలవేణికీ, నాకూ వున్న సంబంధం అతనికి తెలుసు. నీలవేణి కూడా అతనికి తెలుసు. ఆమెతో అతనికి కొంత పరిచయం కూడా వుంది.

కొంత దూరం నడిచిన తరువాత "సుందరరావు ఏక్సిడెంటులో పోయాడుట" చిన్నగా అన్నాడు వేణుగోపాల్. పిడుగు పడ్డట్టనిపించింది. నమ్మలేనట్లు అతనికేసి చూశాను. మౌనంగా ముందుకు నడుస్తున్నాడు.

సుందరరావు పోయాడా? నా నీవేణి విధవ అయిందా? ఊహించుకుంటే భయమేసింది. సుందరరావు పోయాడనే బాధ కంటే నీలవేణి విధవయిందనే విషయం నాకు ఎక్కువ బాధను కలిగించింది. ఇటువంటి దుర్వార్త వినవల్సొస్తుందని కలలో కూడా అనుకోలేదు.

'ఎంత ఘోరం జరిగింది నీలవేణీ మనుసలో అనుకున్నాను.

నడుస్తున్నవాడల్లా ఒక ఇంటిముందు ఆగాడు వేణుగోపాల్. నేనూ ఆగాను. ఆ ఇంటిని చూపించి "గుడ్‌నైట్" చెప్పి వెళ్ళిపోయాడతను.

ఇనుపగేటు నెట్టుకుని లోపలకు వెళ్ళాను. లోపలకు వెడుతుంటే నా అడుగులు తడబడ్డాయి. తలుపులమీద చేతులువేసి చిన్నగా నెట్టాను. దగ్గరకు వేసి వున్నాయేమో వెంటనే తెరుచుకున్నాయి.

మెల్లగా లోపలకు అడుగుపెట్టాను. నాలుగేళ్ళ తరువాత నీలవేణిని ఈ స్థితిలో చూడబోతున్నందుకు గుండె వేగంగా కొట్టుకుంది.

ఆ గదిలో జీరోవాల్టు బల్బు వెలుగుతోంది. నీలవేణి బ్రతుకులాగే గుడ్డిగా వుంది వెలుతురు. ఆ గదిలో వస్తువులన్నీ మసకమసగ్గా కనపడుతున్నాయి.

నా అడుగుల సవ్వడి విని గోడవైపు తిరిగి మంచంమీద కూర్చున్న నీలవేణి నావైపు

తిరిగింది. ఆమె రూపును చూసి విస్తుబోయాను. అప్పటి నీలవేణికీ, ఇప్పుడు చూస్తున్న నీలవేణికీ ఎంతో భేదం కనిపించింది. చిక్కి సగమయింది. కళ్ళు లోతుకు పోయాయి. ముఖంలో జీవం లేదు. నుదుట కుంకుమలేని నీలవేణి ముఖం చంద్రుడు లేని ఆకాశంలా వుంది.

"నువ్వా" అన్నది నీలవేణి. అలా అనటంలో చాలా రోజుల తర్వాత నన్ను చూశాననే సంతోషంలేదు. అవును. ఎట్లా వుంటుంది? భర్తపోయి పుట్టెడు దుఃఖంలో వుంది కదూ.

"కూర్చో" అన్నది.

ఆమెకు ఎదురుగా వున్న పేముకుర్చీలో కూర్చున్నాను.

తలను మోకాళ్ళమీద ఆనించుకుని ఏడుస్తోంది నీలవేణి. దుఃఖంతో ఆమె గుండెలు ఎగిరిపడుతున్నాయి.

ఆ గదిలో ఆమె ఏడుపు శబ్దం తప్పించి మరేమీ వినిపించటం లేదు. గుండెలు పగిలే నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని భరించలేక పోయాను. నీలవేణి దుఃఖాన్ని చూడలేక పోయాను.

"ఏడవకు వేణీ! ఒక్కొక్కప్పుడు మనం అనుకోనివి ఎన్నో జరుగుతూ వుంటాయి. అటువంటివి జరిగినప్పుడు తట్టుకొని నిలబడగలిగితేనే మనం మనుషులం" అంటూ ఓదార్చబోయాను.

కాని నీలవేణి నన్ను ఓదార్చ నివ్వలేదు.

"నీకు తెలుసు సారథీ... నా బాధ మరిచిపోయేది కాదని. నువ్వు చెబుతున్నవన్నీ ఓదార్పు మాటలనీ నీకు తెలుసు. వాటివల్ల నా దుఃఖం తీరదని నీకు తెలీదూ? ఎందుకూ వృథాప్రయత్నం చేస్తావ్? నన్నిలాగే కుమిలిపోనీ" ఏడుస్తూనే అన్నది నీలవేణి.

నీలవేణి తత్వం రవంత కూడా మారలేదు. మేమిద్దరం విడిపోయే రోజుకూడా ఇంతే. నన్ను ఓదార్చనివ్వలేదు.

"ఇటువంటి పరిస్థితుల్లో నిన్ను కలుసుకోవాల్సొస్తుందనుకోలేదు" చిన్నగా అన్నాను.

"ఏదో ఒకరోజు నా బ్రతుకు ఇలా అవుతుందని నాకు తెలుసు సారథీ. ఇక నువ్వు నన్ను కలుసుకుంటావనుకోలేదు. ఇంతకీ నేనిక్కడ వున్నట్టు నీకెవరు చెప్పారు? ఆ వేణుగోపాలేనా?" తడుముకోకుండానే అడిగింది.

"అవును" అన్నాను.

"పెళ్ళి చేసుకున్నావా?" తలెత్తి చూస్తూ అడిగింది.

"లేదు. నువ్విలా అవుతావని నాకు అనిపించకపోయినా ఎందుకో నేను పెళ్ళి చేసుకోలేదు వేణీ!"

"అంటే" నా మాటలు అర్థంకానట్లు నా ముఖంలోకి చూస్తూ అడిగింది.

"అదే వేణీ... మనిద్దరం చివరిసారి కలుసుకొన్న రాత్రి నువ్వన్న మాటలు గుర్తున్నాయా...

నన్ను మరిచిపోవటానికి ప్రయత్నించకు సారధీ... నా తలపులు నీకు బాధ కలిగిస్తున్నా నన్ను మరచిపోవటానికి ప్రయత్నిస్తే అది ప్రేమకు కళంకం అన్నావు. నువ్వన్న మాటమీదనే నిల్చున్నాను. నీ తలపులతో బ్రతుకు గడుపుతున్నాను. నువ్వు నన్ను, నేను నిన్ను ఎంత గాఢంగా ప్రేమించుకున్నామో నీకు తెలుసు. అందుకే జీవితంలో ఒకసారి పొందలేనిది ఇప్పుడు పొందాలని ఆశపడుతున్నాను. నీకు అభ్యంతరమా" అడిగి నీలవేణి ముఖంలోకి చూశాను.

రెండు నిముషాలవరకు ఆమె మాట్లాడలేదు. తర్వాత "క్షమించు సారధీ! నిన్ను కాదంటున్నందుకు... సుందరం బావకు అన్యాయం చెయ్యలేను. బావ దుర్మార్గుడు కావచ్చు... తాగుబోతు కావచ్చు... పరాయి స్త్రీలతో తిరిగే మనిషే కావచ్చు. అయినా ఆయనతో నాలుగేళ్ళు కాపురం చేశాను. ఏదో జరిగిపోయింది. అంతే. ఇక పెళ్ళి చేసుకోను. మళ్ళీ పెళ్ళి మాట తలపెట్టి మన ప్రేమ పవిత్రతను అపవిత్రం చెయ్యకు సారధీ... క్షమించు. బావకు అన్యాయం చెయ్యలేను" మరోసారి అన్నది నీలవేణి ఏడుస్తూ.

ఆమె మాటలు విని నిర్ఘాంతపోయాను. నన్ను ఎంతో గాఢంగా ప్రేమించి, ఎంతో అర్థం చేసుకున్నాననుకున్న నీలవేణేనా ఈ మాటలు మాట్లాడింది? ఆమె సంతోషంగా అంగీకరిస్తుందనుకున్నాను.

భర్తపోయిన నీలవేణిని, పెళ్ళికాని నేను చేసుకోవడానికి సిద్ధపడినా, నన్ను చేసుకునేందుకు ఆమె సిద్ధంగా లేదు. నీలవేణి అంత ఖచ్చితంగా చెప్పిన తర్వాత అక్కడ ఒక్క క్షణం కూడా నిలువ బుద్ధి కాలేదు. నీలవేణిని ఎంతో అర్థం చేసుకున్నాననుకున్నాను. బాగా ఎక్కువగా ఎదిగిపోయింది. అవును. నీలవేణి మాటల్లో తప్పులేదు. నరకం అనుభవించింది. అంత నరకం అనుభవించిన ఏ ఆడదీ మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకోలేదు. నీలవేణీ అంతే.

"వెడుతున్నాను వేణీ" అంటూ ఆమె జవాబుకోసం ఎదురుచూడకుండా వెనక్కి తిరిగాను. నేను వెళ్ళిపోతుండగా నీలవేణి పలికిన మాటలు నాకు వినిపించాయి.

"నీ మాట కాదన్నానని నా మీద కోపం తెచ్చుకొని నన్ను మరిచిపోకు సారధీ... నన్ను మరిచిపోవటానికి ప్రయత్నిస్తే మన ప్రేమకే కళంకం"

"నిన్నులా మరువగలను నీలవేణి ... సుందరరావు భార్యగా నువ్వెప్పుడూ నాకు గుర్తుంటావు. నిన్ను మరువలేను" అనుకుంటూ బయటకు వచ్చాను. నేను రోడ్డుమీదకు వచ్చేసరికి వెన్నెల లేదు. నా హృదయంలాగే దారంతా చీకటి.

(మే 1976 జ్యోతి మాసపత్రికలో ప్రచురితం)